# అనర్హుల రేషన్‌కార్డులు రద్దు.. క్షేత్రస్థాయిలో ముమ్మర సర్వే

## ఇప్పటికే లక్ష మంది అనర్హుల గుర్తింపు

## రేషన్‌కార్డుతో పాన్‌కార్డు, జిఎస్టీ నంబర్లు లింకు

**హైదరాబాద్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** ఏ అర్హత లేకపోయినా వివిధ డొంక తిరుగుడు మార్గాల్లో రేషన్ కార్డులు పొందినవారిపై వేటు వేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధమవుతున్నాయి. ఈ మేరకు క్షేత్రస్థాయిలో రేషన్‌కార్డు అనర్హులను ఏరివేసేందుకు సర్వే ముమ్మరంగా కొనసాగుతోంది. ఈ సర్వే నిరంతరం కొనసాగుతుందని రెవెన్యూ, పౌరసరఫరాలశాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. గ్రామాలు, పట్టణాల్లో కొనసాగుతున్న రేషన్ కార్డుల వెరిఫికేషన్ ప్రక్రియలో అనర్హులుగా తేలినవారి కార్డులను అధికారులు రద్దు చేస్తున్నారు. ఇటీవలి వెరిఫికెషన్‌లో లక్షమందికిపైగా అనర్హులను గుర్తించి వారి రేషన్ కార్డులను రద్దు చేశారు.

తాజాగా మరికొంత మంది రేషన్ కార్డులను రద్దు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. అయితే అనర్హుల గుర్తింపు ప్రక్రియ అనేది నిరంతరం కొనసాగుతున్న నేపథ్యంలో అన ర్హులుగా తేలితే ఎప్పుడైనా రేషన్ కార్డు రద్దు చేసే అవకాశం ఉంది. క్షేత్రస్థాయి సర్వేలో హైదరాబాద్‌లో దాదాపు 2 లక్షల మంది ఐటీ చెల్లింపుదారులు రేషన్ కార్డులు కలిగి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో అనర్హుల రేషన్ కార్డులను రద్దు చేయడంతో పాటు ఇప్పటివరకు పొందిన సబ్సిడిలను రికవరీ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

పాన్ కార్డు, జిఎస్టి నంబర్లను రేషన్ కార్డు డేటాతో లింక్ చేశారు. దీంతో హైదరాబాద్ నగరంలో దాదాపు 2 లక్షల మంది ఇన్‌కమ్ ట్యాక్స్ చెల్లిస్తూ రేషన్‌కార్డు పొందుతున్నట్లు వెల్లడైంది. ప్రభుత్వ ఉద్యోగుల కార్డులు, ఐటి చెల్లింపుదారులను ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో గుర్తించారు. అనంతరం అనర్హుల డేటా బయటకు వచ్చింది. ఇన్‌కమ్ ట్యాక్స్ చెల్లించేవారి రేషన్ కార్డులను రద్దు చేయాలని కేంద్రం భావిస్తోంది. ఆధార్, పాన్ వివరాలను ఇన్‌కమ్ ట్యాక్స్ డేటా సాయంతో పరిశీలిస్తోంది. అనంతరం వారి ఆర్థిక స్తోమతను అంచనా వేసి కార్డుల తొలగింపు ప్రక్రియ చేపడుతున్నారు. ఇక ఖరీదైన వాహనాలు కలిగి ఉన్నవారిని కూడా లబ్ధిదారుల జాబితా నుంచి తొలగిస్తున్నారు. ఇక మరణించిన వ్యక్తుల పేర్లపై ఉన్న కార్డులను కూడా తొలగించే ప్రక్రియ ప్రారంభమైంది. ఇక పిఎం కిసాన్ డేటా ప్రకారం 52 వేల మందికిపైగా ఇన్‌కమ్‌ట్యాక్స్ చెల్లిస్తున్నట్లు వెల్లడైంది. రేషన్‌కార్డులకు పట్టణాల్లో రూ.2 లక్షలు, గ్రామాల్లో రూ.1.50 లక్షల్లోపు వార్షిక ఆదాయం ఉన్నవారు అర్హులు.

# పవన్ ఖేరా యాంటిసిపేటరీ బెయిల్‌పై నేడు హైకోర్టు తీర్పు

## రాజకీయ కక్షతో కేసు నమోదు: అభిషేక్ మనుసింఘ్వీ

## హైదరాబాద్‌తో సంబంధం ఏమిటి?: అసోం ఎజి దేవ్‌జిత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 9:** కాంగ్రెస్ సీనియర్ నేత పవన్ ఖేరా అరెస్ట్ అవుతారా లేదా అనే అంశంపై రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ భార్య ఆస్తులు, పాస్‌పోర్టులపై చేసిన ఆరోపణల కేసులో తనను అరెస్ట్ చేయకుండా ట్రాన్సిట్ యాంటిసిపేటరీ బెయిల్ కోరుతూ ఆయన తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో గురువారం జస్టిస్ సుజన బెంచ్ ముందు విచారణ జరిగింది. ఖేరా తరఫున సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వీ, తెలంగాణ హైకోర్టు సీనియర్ న్యాయవాది రవీందర్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఈ కేసు పూర్తిగా రాజకీయ కక్ష సాధింపుతో నమోదు చేసినదేనని పేర్కొన్నారు. రాజకీయాల్లో విమర్శలు సహజమని, పరువు నష్టం కేసులో అరెస్ట్ చేయడానికి ఇంటికి వంద మందిని పంపిస్తారా? అని సింఘ్వీ వాదించారు. అయితే అసోం అడ్వకేట్ జనరల్ దేవజిత్ లోన్ సైకియా ఈ వాదనలను ఖండిస్తూ, ఢిల్లీ నివాసి అయిన ఖేరా హైదరాబాద్‌లో ముందస్తు బెయిల్ ఎందుకు కోరారో సరైన కారణాలు చూపలేదని కోర్టుకు తెలిపారు. ఈ కేసును విచారించే పరిధి తెలంగాణ హైకోర్టుకు లేదని, ఖేరా ఆధార్ అడ్రస్ ఢిల్లీలో ఉందని, ఆయనకు హైదరాబాద్‌లో ఏం సంబంధమని ప్రశ్నించారు. కాగా, అసోం సిఎం హిమంత బిశ్వ శర్మ భార్యకు విదేశీ పాస్‌పోర్టులు, విదేశాల్లో ప్రకటించని ఆస్తులు ఉన్నాయని పవన్ ఖేరా ఇటీవల ఒక ప్రెస్ మీట్‌లో ఆరోపించారు. ఈ వ్యాఖ్యలపై అసోం పోలీసులు ఆయనపై పరువునష్టం, ఫోర్జరీ, నేరపూరిత కుట్ర వంటి భారతీయ న్యాయ సంహితలోని 14 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. దీంతో తనకు ట్రాన్సిట్ యాంటిసిపేటరీ బెయిల్ ఇవ్వాలని ఖేరా తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఎఫ్ఐఆర్ నమోదైన రాష్ట్రంలోని పోలీసులు అరెస్ట్ చేయకుండా కాపాడేది ఈ బెయిల్, ఆ తర్వాత ఆయన సంబంధిత రాష్ట్రంలోని కోర్టును ఆశ్రయించేందుకు వీలు కలుగుతుంది. కాగా, పవన్ ఖేరా ముందస్తు బెయిల్ పిటీషన్‌పై గురువారం హైకోర్టులో విచారణ జరగగా హైకోర్డు ధర్మాసనం తీర్పు వెల్లడిని శుక్రవారానికి వాయిదా వేసింది.

# 12న ఇంటర్ ఫలితాలు?

## ఫలితాలను ముఖ్యమంత్రి విడుదల చేసే అవకాశం

**హైదరాబాద్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు జరిగిన ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల ఫలితాలను ఈ నెల 12న విడుదల చేయడానికి ఇంటర్ బోర్డు సన్నాహాలు చేస్తోంది. ఫలితాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా విడుదల చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దగ్గరే విద్యాశాఖ కూడా కొనసాగుతున్నందున ఇంటర్ ఫలితాలను సీఎం స్వయంగా విడుదల చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఫలితాలను సీఎం ఇంటి దగ్గర విడుదల చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. సీఎం ఫలితాలను విడుదల చేయడానికి కారణం.. రానున్న 2026-27 విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలు చేయడంతోపాటు గవర్నమెంట్ జూనియర్ కాలేజీ విద్యార్థులకు ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌తోపాటు, పాలు కూడా అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించి మార్చి 20న ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ఇందుకు సంబంధించి నిధులను సైతం కేటాయించారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కోసం రూ. 70 కోట్లను కేటాయించగా.. బ్రేక్‌ఫాస్ట్, పాలు ఇవ్వడం కోసం రూ. 56 కోట్లను కేటాయించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతోపాటు ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌ను అమలు చేసే విషయాన్ని స్వయంగా ముఖ్యమంత్రి ప్రకటిస్తూ.. ఇంటర్మీడియట్ ఫలితాలను విడుదల చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఈ నెల 12న కాకపోతే 13న ఇంటర్ ఫలితాలను విడుదల చేసే అవకాశం ఉంది. ఇంటర్ వార్షిక పరీక్షలు ఫిబ్రవరి 25న ప్రారంభమై మార్చి 18తో ముగిశాయి. ఇంటర్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనాన్ని మార్చి 15 నుంచి 20 కేంద్రాల్లో ప్రారంభించారు. ఈ నెల1తో మూల్యాంకన ప్రక్రియ ముగిసింది. మూల్యాంకన అనంతరం ఫలితాల విడుదలకు సంబంధించిన క్రోడీకరణ పనులను ఇంటర్ బోర్డు అధికారులు ఈ నెల 8 వరకు పూర్తి చేశారు. ఇంటర్ ఫలితాల విడుదల కోసం ఇంటర్ బోర్డు ప్రభుత్వానికి ఈ నెల 9, 10, 11 తేదీల్లో ఏదో ఒకరోజు విడుదల చేయడానికి అనుమతి కోరుతూ ప్రభుత్వానికి లేఖ రాసినట్టు తెలిసింది. గురువారం ఇంటర్ బోర్డు అధికారులు విద్యాశాఖ అధికారులతో చర్చించిన అనంతరం ఈ నెల 12న ఫలితాలను విడుదల చేయడానికి సుముఖత వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఒకవేళ ఈ నెల 12న వీలుకాకపోతే 13న ఇంటర్ ఫలితాలను విడుదల చేసే అవకాశం ఉంది.

# ఆరోగ్యం సరిగా లేకుంటే సంపాదన ఎంతున్నా వృథానే

## వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

## కేబుల్‌బ్రిడ్జిపై వైద్య శాఖ వలంటీర్ల మానవహారం



వలంటీర్లతో కలిసి కేబుల్‌బ్రిడ్జిపై మానవహారంలో పాల్గొన్న మంత్రి దామోదర రాజనర్సింహ తదితరులు

**హైదరాబాద్ (గచ్చిబౌలి), ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** ఆరోగ్యం సక్రమంగా లేకపోతే ఎంత సంపాదన ఉన్నా వ ృథానే అని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖమంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మాదాపూర్‌లో వైద్య, ఆరోగ్య శాఖ అధ్వర్యంలో మిషన్ ఎయిడ్స్ సురక్ష పేరిట అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా మాదాపూర్‌లోని దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జీ మీద వైద్య శాఖ వాలంటీర్లు మానవ హారం నిర్వహించి ఎయిడ్స్ వ్యాధిపై అవగా హన కలి ్పంచారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖమంత్రి దామోదర రాజనర్సింహ ముఖ్యఅతిదిగా హాజరై వలంటీర్లతో కలిసి మానవహారంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఎయిడ్స్‌ను మానసిక వేదన, ప్రాణాంతక వ్యాధిగా భావించామని, ఎయిడ్స్ వ్యాధి బాధితులు ఎన్నో అవమానాలకు గురయ్యారని అన్నారు. హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై మరింత అవగాహన కల్పించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా మానవ హారాలు, ర్యాలీలు నిర్వహించడంతో పాటు మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. హెచ్ఐవీ బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత పరీక్షలు, చికిత్స, మందులు అందజేస్తుందనా ్నరు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, ప్రమాదకరమైన ఇంజక్షన్ల ద్వారా డ్రగ్స్ తీసుకుంటే హెచ్ఐవీ వంటి ఇతర రోగాలు వా ్యపించే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్య క్రమంలో తెలంగాణ పీఎసీ చైర్మన్, శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారా యణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యతపై తనిఖీ బృందాల కన్ను

## రాష్ట్రవ్యాప్తంగా 299 తనిఖీ బృందాలు ఏర్పాటు

## ఇప్పటికే 4,600 పాఠశాలల్లో తనిఖీలు

## వచ్చే విద్యాసంవత్సరం నుంచి మరింత దూకుడు

## ముఖ్యమంత్రి కార్యాలయ ప్రకటన

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 9:** పాఠశాల విద్యలో నాణ్యతను మెరుగుపరచాలనే లక్ష ్యంతో తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి తనిఖీ బృందాలు క్షేత్రస్థాయిలో స్పష్టమైన ఫలితాలు చూపిస్తున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు పాఠశాల విద్యాశాఖ 2025 సెప్టెంబర్‌లో రాష్ట్రవ్యాప్తంగా ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో తనిఖీలు నిర్వహించేందుకు 299 బృందాలను నియమించింది. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు ముగ్గురు ఉపాధ్యాయులతో, ఉన్నత పాఠశాలలకు తొమ్మిది మంది ఉపాధ్యాయులతో ఈ బృందాలను ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఉన్నత స్థాయి కమిటీ ఈ తనిఖీ బృందాలను గుర్తించి నియమించింది.

| బృందాల సంఖ్య | చేపట్టిన తనిఖీలు |
|---|---|
| ప్రాథమిక 168 | 3,409 |
| ప్రథమికోన్నత 35 | 557 |
| ఉన్నత 96 | 589 |
| మొత్తం 299 | 4,555 |

ఈ మేరకు గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. కనీసం 10 సంవత్సరాల అనుభవం, ఇన్‌సర్వీస్ శిక్షణ, డిజిటల్ అక్షరాస్యత, క్రమశిక్షణా రికార్డు సవ్యంగా ఉన్న టీచర్లను ఇన్‌స్పెక్టింగ్ అధికారులుగా ఎంపిక చేశారు. కేటాయించిన పాఠశాలల్లో తనిఖీలు పూర్తి చేసి, ప్రతి వారం డిస్ట్రిక్ట్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్లకు (డిఈఓ) నివేదికలు సమర్పించాలని మార్గదర్శకాలు జారీ చేశారు.

ఇప్పటిదాకా సుమారు 4,600 పాఠశాలల్లో తనిఖీలు జరిగాయి. వీటిలో 3,966 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు; 589 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. పనితీరు ప్రమాణాలకు అనుగుణంగా లేని ఉపాధ్యాయుల వివరాలు, సిలబస్ పూర్తి చేయడంలో వెనుకబడిన తరగతుల స్థితిగతులు. ఈ నివేదికల్లో క్రమం తప్పకుండా నమోదవుతున్నాయి. ఈ తనిఖీల ప్రభావం ఉపాధ్యాయ వర్గాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. బోధనలో నిర్లక్ ్ష్యం వహిస్తున్న ఉపాధ్యాయుల్లో ఈ బృందాల పట్ల ఆందోళన పెరిగిందని చర్చ జరుగుతోంది. అదే సమయంలో, కొందరు ఉపాధ్యాయులు నివేదికల రూపకల్పన, పాఠశాల పరిపాలనా వ్యవహారాల పేరుతో పాఠ్యాంశాలు నిర్ణీత సమయంలో పూర్తి చేయడంలో వెనుకబడుతున్నట్లు తేలింది. బోధనలో లోపాల వల్ల విద్యార్థులు నాణ్యమైన చదువుకు దూరం కాకుండా చూడటమే ఈ బృందాల ప్రధాన లక్ ్ష్యం. ఆకస్మిక తనిఖీలతో పాటు, ఇప్పటికే తనిఖీ చేసిన పాఠశాలలను మళ్ళీ పర్యవేక్షి ంచే బాధ్యత కూడా ఈ బృందాలకు అప్పగించారు. తొలి తనిఖీ తర్వాత పాఠశాలలు మళ్ళీ పాత పద్ధతులకు మళ్ళకుండా నిరంతర పర్యవేక్షణ సాగిస్తున్నారు.

జిల్లాలోని ప్రతి పాఠశాలలో తనిఖీలు జరిగేలా, ఒక్కో బృందానికి మూడు నెలల వ్యవధిలో 100 ప్రాథమిక/ప్రాథమికోన్నత లేదా 50 ఉన్నత పాఠశాలల చొప్పున లక్ష్యాలను నిర్దేశించారు. అయితే, కొన్ని జిల్లాల్లో తనిఖీలు ఆశించిన స్థాయిలో సాగలేదని గుర్తించి, వచ్చే విద్యా సంవత్సరం నుండి మరింత పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. అయితే, పాఠశాల తనిఖీలు అత్యధికంగా సంగారెడ్డి (811), సూర్యాపేట (442), ఆదిలాబాద్ (429), నాగర్ కర్నూల్ (367) జిల్లాల్లో జరగ్గా పెద్దపల్లి, నిర్మల్, మెదక్, వికారాబాద్ లలో అసలు తనిఖీలే మొదలవ్వలేకపోవడం గమనార్హం.

# థియేటర్లలో పర్సంటేజ్ చిచ్చు

## నిర్మాతలు, ఎగ్జిబిటర్ల మధ్య ముదురుతున్న వివాదం

**హైదరాబాద్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** తెలంగాణలోని సినిమా రంగంలో థియేటర్ల చిచ్చు రేగింది. పర్సంటేజ్ విధానం అమలుపై థియేటర్ యజమానులు (ఎగ్జిబిటర్స్), నిర్మాతల (ప్రొడ్యూసర్స్) మధ్య వివాదం చెలరేగి తారాస్థాయికి చేరింది. పర్సంటేజ్ విధానం ప్రకారం సినిమా టికెట్ కలెక్షన్లలో ఒక నిర్దిష్ట శాతం నిర్మాతలు, థియేటర్ యజమానుల మధ్య పంచుకోవడం జరుగుతుంది. ప్రస్తుతం అమలులో ఉన్న రెంటల్ లేదా ఫిక్స్‌డ్ మోడల్ విధానం రద్దు చేసి పర్సంటేజ్ పద్ధతిని ప్రొడ్యూసర్స్ తెరమీదకు తెచ్చారు. సినిమా థియేటర్లలో పర్సంటేజ్ విధానం అమలు చేస్తే తమ ఆదాయం స్థిరంగా ఉండే అవకాశం ఉందని ఎగ్జిబిటర్స్ చెబుతున్నారు. అయితే యాక్టివ్ ప్రొడ్యూసర్స్ గిల్డ్ మాత్రం ఈ విధానానికి వ్యతిరేకత వ్యక్తం చేస్తోంది. నిర్మాతల వాదన ప్రకారం పర్సంటేజ్ విధానం వల్ల తమకు వచ్చే లాభాలు తగ్గే ప్రమాదం ఉందని ఆభ్యతరం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా భారీ బడ్జెట్ సినిమాల విషయంలో ఈ విధానం అనుకూలంగా ఉండదని వారు స్పష్టం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పర్సంటేజ్ విధానం పట్ల అనుకూల, వ్యతిరేక వైఖరి అవలంబించడంతో ఇరువర్గాల మధ్య ఈ విభేదాలు పరిష్కా రం కాక మరింత బిగుసుకుంటోంది. దీంతో చిత్ర పరిశ్రమలో అనిశ్చితి నెలకొంది. త్వరలో విడుదలకు సిద్ధంగా ఉన్న డెకాయిట్, లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ వంటి సినిమాలపై ఈ వివాదం ప్రభావం చూపే అవకాశముంది. పరిస్థితులు చక్కబడకపోతే రిలీజ్ తేదీలు మారే అవకాశం ఉండటంతో పాటు కొన్ని సినిమాలు వాయిదా పడే పరిస్థితి కూడా కనిపిస్తోంది. ఇప్పటికే టాలీవుడ్ మార్కెట్‌పై ఈ పరిస్థితి ప్రతికూల ప్రభావం చూపే సూచనలు కనిపిస్తున్నాయి.

# ఆదాయపన్ను శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్‌గా సురేశ్ బత్తిని



**ప్రభాతవార్త ప్రధాన ప్రతి నిధి, హైదరాబాద్, ఏప్రిల్ 9:** తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల ఆదాయ పన్ను శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్‌గా సురేశ్ బత్తిని నియమితుల య్యారు. ప్రస్తుతం మోరంపూడి అనిల్ కుమార్ ప్రిన్సిపల్ చీఫ్ కమిష నర్‌గా ఉన్నారు. ఆయన స్థానంలో సురేశ్ బత్తిని బాధ్యతలు చేపడుతారు. వీరిద్దరూ తెలుగువారే. సురేశ్ బత్తినిని నియమిస్తూ కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) ఉత్తర్వులు జారీ చేసింది. సురేశ్ బత్తిని గతంలో హైదరాబాద్ రీజియన్‌లో చీఫ్ కమిషనర్‌గా పని చేశారు. రెండు తెలుగు రాష్ట్రాలలోని పన్నుల పరిపాలన, ఆదాయ వసూళ్ల లక్ష్యాలు, శాఖాపరమైన అంశాలపై ఆయనకు పూర్తిస్థాయి అవగాహన ఉంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆదాయపన్ను శాఖకు సంబంధించి అత్యున్నత పదవి ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ పదవి. పన్ను వసూళ్ల లక్ష్యాలను పర్యవేక్షి ంచడంతో పాటు చెల్లింపుదారులకు మెరుగైన సేవలు అందించడం, శాఖాపరమైన పరిపాలనను సమన్వయం చేయడం వంటివి ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ ప్రధాన బాధ్యతలు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

# పొంగులేటి కాదు.. పొంగులూటి

## అక్రమాలన్నీ బయట పెడతాం

## అవినీతి బాగోతం బట్టబయలయ్యేసరికి బూతులు

## వనపర్తిలో మీడియాతో మాజీమంత్రి హరీశ్‌రావు

**వనపర్తి ప్రతినిధి, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** నేనొక్కన్నే అవినీతిపరుడుని కాదు అందరూ మంత్రులు అవినీతిపరులే అని తేల్చారని, జూపల్లి కృష్ణారావు సీఎం బట్టి సహా రాష్ట్రంలో అవినీతి కుంభకోణాల చిట్టా ఆయనే చదివారని పొంగులేటి కాదు పొంగులూటీ అని ఆయనే చెప్పకనే చెప్పారని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. అవినీతి బాగోతం బట్టబయలు అయ్యేసరికి డిఫెన్స్‌లో పడి బూతులు తిట్లు పిట్టకథలు చెప్పాడంటూ హరీష్ రావు ఫైర్ అయ్యారు. వనపర్తి జిల్లా రేవల్లి మండలం నాగపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అత్యంత పవిత్రమైన సచివాలయంలో పొంగులేటి మాటలు ఆయన బూతులు చూస్తే ఫ్రస్టేషన్ తెలుస్తుంది అన్నారు. ఒక రాష్ట్ర మంత్రిగా కాకుండా రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అధినేతగా మాట్లాడారని పేర్కొన్నారు. తన కొడుకును కాపాడుకునే ప్రయత్నం చేశారని పిట్ట కబుర్లు చెప్పి బయటపడాలని అనుకున్నాడని అన్నారు. పొంగులేటి పొగరు తగ్గించుకో అంటూ హితవు పలికారు. రాఘవకు మైనింగ్ లేదని ఎందుకు చెప్పలేదని, అసెంబ్లీలో ఉండి కూడా నాది కాదని ఎందుకు చెప్పలేదు జవాబు ఇవ్వాలన్నారు. నాగర్‌కర్నూల్ భూములు కాపాడింది బీఆర్ఎస్ పార్టీ అని స్పష్టం చేశారు. నిషేధిత భూముల జాబితాలో పెట్టింది, హైకోర్టులో కూడా కొట్లాడింది బీఆర్ఎస్ అని వివరించారు. అవి ప్రభుత్వ భూములు అయితే రోజుకొక పేరు ఎందుకు మారుతుందని, భూమిని ఎందుకు స్వాధీనం చేసుకోలేదని, ఎందుకు కంపెనీల బోర్డులు మారుతున్నాయని హరీష్ రావు ప్రశ్నించారు. ఒకవేళ నిజంగా ప్రభుత్వ భూములు అయితే హైడ్రాక్ గడ్డి పీకుతుందా అంటూ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆర్డిఓ ఏం చేస్తున్నారు ప్రభుత్వ ల్యాండ్ అని ఆర్డర్ ఉండగా హైడ్రా ఎందుకు కండ్లు మూసుకుంది. నిజాయితీ ఉంటే చిత్తశుద్ధి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పొంగులేటి ఇప్పటికైనా తప్పు ఒప్పుకో ప్రజలకు క్షమాపణ చెప్పు అంటూ హితవు పలికారు.

# రాష్ట్రంలో పెరిగిన వరి దిగుబడి

## తెలంగాణకు బాయిల్డ్ రైస్ కోటాను పెంచాలి

## కేంద్ర ఆహార శాఖ మంత్రి ప్రహ్లాద్‌జోషికి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి లేఖ

**హైదరాబాద్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** రాష్ట్రానికి ఉడికించిన బియ్యం లక్ష్యాన్ని (2024-25 రబి సిజన్‌కు) 5 లక్ష మెట్రిక్ టన్నుల మేర పెంచాలని, అదే స్థాయిలో ముడి బియ్యం లక్ష్యాన్ని తగ్గించాలని కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర పౌరసరఫరాలశాఖమంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కీలక విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం 8.45 లక్ష మెట్రిక్ టన్నుల బియ్యం ఇంకా సరఫరా చేయాల్సి ఉన్న నేపథ్యంలో మరో 60 రోజుల గడువు ఇవ్వాలని కోరారు. తెలంగాణలో పండిన వరి నాణ్యత అధికంగా ఉండటంతో, ఉడికించిన బియ్యం తయారికి అనుకూలమని పేర్కొన్నారు. రైస్ మిల్లర్లు కూడా కేవలం 5శాతం బ్రోకెన్స్‌తో సరఫరా చేయడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలో పెరుగుతున్న వరి ఉత్పత్తి, కేంద్రం తగ్గిస్తున్న కొనుగోలు లక్ష్యాల మధ్య అసమతౌల్యత ఏర్పడుతున్న నేపథ్యంలో గురువారం ఆయన కేంద్ర ఆహారశాఖమంత్రి ప్రహ్లాద్ జోషికి లేఖ రాశారు. కేంద్ర ప్రభుత్వం ముందు మూడు ముఖ్యమైన డిమాండ్లను ఉంచారు. 2025-26 (ఖరీఫ్, రబీ సీజన్లు కలిపి) కోసం ఉడికించిన బియ్యం లక్ష్యాన్ని 20 లక్ష మెట్రిక్ టన్నుల మేర పెంచాలని డిమాండ్ చేశారు. ఇది రాష్ట్రంలో పెరుగుతున్న ఉత్పత్తికి అనుగుణంగా అవసరమని స్పష్టం చేశారు. రబి 2024-25 బియ్యం సరఫరాకు మరో రెండు నెలల గడువు ఇవ్వాలని కేంద్రాన్ని ఆయన కోరారు. ఖరీఫ్ వరి నిల్వల భౌతిక పరిశీలన ఇంకా పూర్తికాకపోవడంతో మిల్లింగ్ ప్రక్రియకు అదనపు సమయం అవసరమన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వరి ఉత్పత్తి గణనీయంగా పెరిగిందని లేఖలో మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు. రైతులకు కనీస మద్దతు ధర అందించేందుకు కేంద్ర ప్రభుత్వం తరఫున రాష్ట్రం డి సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ స్కీమ్ ద్వారా వరి కొనుగోలు చేస్తోందన్నారు. అయితే కేంద్రం కస్టమ్ మిల్లింగ్ రైస్, ఉడికించిన బియ్యం లక్ష్యాలను తగ్గించడంతో రాష్ట్రానికి అనేక సమస్యలు తలెత్తుతున్నాయని లేఖలో స్పష్టం చేశారు. ఎఫ్‌సిఐకి 2024-25లో సరఫరా చేసిన ఉడికించిన బియ్యం శాతం 66.78 కు పడిపోయిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో వరి ఉత్పత్తి భారీగా పెరుగుతున్నా.. కేంద్ర ప్రభుత్వ కొనుగోలు విధానాలు అందుకు అనుగుణంగా లేకపోవడం ప్రధాన సమస్యగా మారిందన్నారు. రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు కేంద్రం తక్షణమే సానుకూల నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# విజిలెన్స్ అప్రమత్తతతో రూ.90 కోట్ల ఆదాయ నష్టనివారణ



విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆరునెలల పనితీరుపై సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న డైరెక్టర్ జనరల్ శిఖాగోయల్

## అక్రమంగా రవాణా చేస్తున్న 2,669 మె.ట ఇసుక స్వాధీనం

## 134 వాహనాల సీజ్, 27 ఎఫ్ఐఆర్‌లు నమోదు

## రూ.103.70లక్షల పిడిఎస్ బియ్యం స్వాధీనం

## పనితీరు సమీక్షించిన డైరెక్టర్ జనరల్ శిఖాగోయల్

## అత్యుమ ప్రతిభ ప్రదర్శించిన అధికారులకు నగదుపురస్కారం

**హైదరాబాద్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం తన ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యకలాపాల్లో అప్రమత్తతో వ్యవహరిస్తూ ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ తెలంగాణ ప్రభుత్వంకు చెందిన వివిధ శాఖల్లో ఆరునెలల కాలంలోనే రూ.90 కోట్ల మేర ఆదాయ నష్టనివారణ చేయడం జరిగిందని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ శిఖాగోయల్ తెలిపారు. గురువారం బిఆర్‌కెభవన్‌లో ఎనిమిది ప్రాంతీయ విభాగాల సిబ్బందితో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ గత ఆరునెలల పనితీరుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాత్రనకా పగలనకా, వర్షం, చలి, ఎండా లెక్క చేయకుండా ఒక టీమ్‌లా మనం పనిచేయడంతో రాష్ట్రవ్యాప్తంగా అక్రమంగా రవణా చేయబడతున్న 2,669 మెట్రిక్ టన్నుల ఇసుకను స్వాధీనం ఈ ఆరు నెలల కాలంలోనే స్వాధీనం చేసుకొన్నామని చెప్పారు. ఇసుక అక్రమరవాణాపై 27 ఎఫ్ఐఆర్‌లు నమోద య్యాయని, 134 వాహనాలను సీజ్ చేశారని తెలిపారు. రైస్‌మిల్లులపై ఆకస్మిక దాడులు చేసి పెద్ద ఎత్తున అక్రమాలను కట్టడి చేయగలిగామని ఇదే స్ఫూర్తితో ముందుముందు పనిచేయాలని సిబ్బందిని కోరారు. ప్రజాపంపిణీ బియ్యం రూ.103.70 లక్షల విలువగలవి అక్రమార్కుల నుంచి స్వాధీనం చేసుకున్నామని గణాంకాలతో అధికారులకు వివరించారు. ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడానికి విచారణల పట్ల సమగ్ర విధానాన్ని అవలంబించడంపై దృష్టి కేంద్రీకరణ చేయాలని శిఖా హితవు చెప్పారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అనేది కేవలం ప్రభుత్వ ఆదాయ లీకేజీలను గుర్తించడమే కాకుండా, సేవా పంపిణీ లోపాలను కూడా పరిష్కరించాలని, అవసరమైన చోట అధికారులపై బాధ్యతను నిర్ణయించాలని ఆమె నొక్కి చెప్పారు. ప్రాంతీయ విభాగాలు ఎవరి ఆదేశాల కోసం వేచి చూడకుండా చురుకుగా వ్యవహరించాలని, తెలంగాణ ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా తమ పనితీరును మెరుగు పరచుకోవాలని ఆదేశించారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం సేవా రంగంలో అత్యుత్తమ ప్రతిభను గుర్తించడానికి త్రైమాసిక నగదు పురస్కారంను ప్రారంభించామని ఆమె ప్రకటించారు. విజిలెన్స్‌లోని ఎన్‌ఫోర్స్‌మెంట్, విచారణలు, అడ్మినిస్ట్రేటివ్ పని అనే మూడు విభాగాలలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన వారిని గౌరవించడానికి మొట్టమొదటిసారి ఈ రివార్డ్స్ రోల్‌ను ఏర్పాటు చేశామని ఆమె తెలిపారు. పారదర్శకతను నిర్ధారించడం, సమర్థవంతమైన పాలనను బలోపేతం చేయడంపై నిరంతర దృష్టితో, ఎన్‌ఫోర్స్‌మెంట్ అనేది శాఖ యొక్క ప్రధాన బాధ్యతగా కొనసాగుతుందని పేర్కొన్నారు. అక్రమ ఇసుక రవాణా, పిడిఎస్ బియ్యం మళ్లింపు. ఆహార కల్తీ వంటి అంశాలపై శాఖ ప్రాథమికంగా దృష్టి సారిస్తుందని డిజి స్పష్టం చేశారు. అక్రమ కార్యకలాపాలను అరికట్టడానికి, పన్ను ఎగవేతను నిరోధించడానికి, ప్రభుత్వ ఆదాయాన్ని కాపాడటానికి, రవాణా, వాణిజ్య పారిశ్రామిక చట్టాలకు కట్టుబడి ఉండేలా ప్రతిక్షణం డేగకన్నువేసి ఉండాలని కోరారు. అక్రమాలు లేదా ప్రభుత్వ నిధులు వనరుల దుర్వినియోగం గురించి పౌరుల నుంచి సమాచారం విరివిగా అందుకోవడానికి టోల్ ఫ్రీ నంబర్14432 బహుళ ప్రచారంలోకి తీసుకొని రావాలని ప్రతి గ్రామపంచాయతీ గోడపై, పాఠశాలల గోడలపై ముద్రించాలని ఆమె కోరారు. విజిలెన్స్ శాఖలో ఉద్యోగులు గుర్తింపుప్రేరణను పెంపొందించడానికి ప్రతి త్రైమాసికంలో ఈ రివార్డ్స్ రోల్‌ను నిర్వహిస్తామని ఆమె ప్రకటించారు. విధి పట్ల అసాధారణమైన నిబద్ధత, చిత్తశుద్ధి సేవా పంపిణీని ప్రదర్శించిన 67 మంది అధికారులకు సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఆర్.సి. పురం సమర్థవంతమైన ఎన్‌ఫోర్స్‌మెంట్ పనితీరుకు, హైదరాబాద్‌రూరల్ అత్యధిక విచారణల పరిష్కారానికి, కరీంనగర్ ఆదాయ నష్ట నివారణ గుర్తింపులో అత్యుత్తమ ప్రతిభ కనబరచడంతో శిఖా ఆయా యూనిట్లను అభినందించింది. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఎ.ఆర్. శ్రీనివాస్, ఐపిఎస్ , డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ అభిషేక్ మహంతి, ఐపిఎస్, ఎస్పీ బాల స్వామి, ఐపిఎస్, అందరూ రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సిబ్బంది చురుకుగా పాల్గొన్నారు.

**ఇ-వేలం ప్రకటన**

ఇందుమూలముగా యావన్మంది సాధారణ ప్రజానీకానికి సమాచారం నిమిత్తం ప్రకటించునది ఏమనగా వివిధ కేటగిరీల 1800 సంఖ్య, ఆకు పచ్చని నిట్టనిలువు చెట్లు దేవరయాంజాల్, హకీంపేట్, సికింద్రాబాద్ వద్ద 29.04.2026న ఉ.11.00 గం.కు ఇ-వేలం ద్వారా ఎయిర్ వార్‌ఫేర్ కళాశాల యొక్క రీలోకేషన్ కొరకు విక్రయించబడును. ఆ చెట్లు కాంట్రాక్టర్‌కు 27.04.2026న, 28.04.2026 11.00 గం. వరకు చూపించబడును. ఉద్దేశ్యం ఉన్న బిడ్డర్ సదరు చెట్లను వీక్షించుటానికి మరియు లొకేషన్ చూడటానికి, చెట్ల తనిఖీకి రావటానికి స్థానిక మిలటరీ అథారిటీతో (మొబైల్ నం. 7073766150, 9205458451) సంప్రదించినట్లయితే అనుమతించబడతారు. ఇ-వేలంలో పాల్గొనటానికి https://eauction.gov.in/eAuction/app వద్ద ప్రభుత్వ ఇ-వేలం సిస్టమ్ యొక్క పోర్టల్‌ను దయచేసి వీక్షించండి.

సం/- (C. దినేష్ కుమార్ రెడ్డి)
డిఫెన్స్ ఎస్టేట్స్ ఆఫీసర్
T & AP సర్కిల్, సికింద్రాబాద్

